ఎడిటర్ గారికి నమస్కారాలతో,

ప్రచురణార్ధం...

# " పెద్దనోట్లు పెద్దలకోసమేనా "

నేటి భారతదేశం వైశాల్యం పరంగా ప్రపంచంలో ఓ ఉపఖండం. జనాభాలో రెండవ అగ్రరాజ్యం. మరి బ్రతుకు పోరాటంలో మధ్యతరగతి దేశం. ఎందుకంటే మన దేశ జనాభాలో చాలా వరకు మధ్య తరగతికి చెందిన వారే. మొత్తం దేశం యొక్క ఆర్థిక వ్యవస్థ వీరి పైనే చాలా వరకు ఆధారపడి వుంది.

ఈ మధ్య తరగతి జనానికి దిన ప్రారంభం అల్పాహారం మరియు కాఫీ లేదా టీ లలో ఏదో ఒక దానికి గాను మొత్తం అయ్యే ఖర్చు రూ. 30/-, ఇక మధ్యాహ్నం ఒక పూర్తి భోజనం రూ. 60/-, సాయంకాలం ఒక మంచి కాఫీ లేదా టీ.కి రూ. 10/-, ఇక రాత్రికి కూడా రూ. 60/- నుంచి 80/- వరకు అవుతుంది. ఇక సెలవు దినాలతో మానసిక ప్రశాంతతకు నెలకు- 300/- నుండి 500/-, ఇక ఆరోగ్యానికి గాను రూ. 200/- నుంచి 250/-.వీటిఅన్నింటి మొత్తం సుమారుగా నెలకు 6000-7000/- అవుతుంది.

ఇది ఒక ఆరోగ్య వంతుని మధ్యతరగతి వ్యక్తికి సరిపోయే డబ్బు. కానీ, ఈ మొత్తంను ఆ వ్యక్తి రోజువారిగా ఖర్చు చెయ్యాలంటే కేవలం రూ. 200/- లేదా 250/- సరిపోతుంది. మరి రూ. 200 కోసం రూ. 500/- లేదా రూ. 1000/- నోట్లు అవసరమా. మరి ఎవరికోసం మన భారతీయ రిజర్వు బ్యాంక్ రూ. 500/-, 1000/- లను ముద్రించి భారత దేశ ఆర్థిక వ్యవస్థను పతనం వైపు పరుగులు తీయిస్తోంది. చిల్లర నాణ్యాల పై గాని, చిన్న నోట్లపై గాని దృష్టి సారించడం లేదు ఎందుకని?

చాలా కాలంగా రూ. 5 నోట్లను చాలా అంగళ్ళలో తీసుకోవటం లేదు. దానికి స్పందనగా కేవలం పత్రికలలో ఆ పూటకి ఓ వార్తను ప్రచురించి చేతులు దులుపుకోవటం. ఆ పై చర్యల గురించి మరిచి పోవటం. ఆ పెద్ద నోట్లపై వున్న శ్రద్ధ ఈ చిన్న నోట్లపై ఎందుకు సారించడం లేదు. ఏనాడో 5,10,20 పైసళ్ళను మరిచి పోయాం. కానీ నేటికీ ప్రతి వస్తువుపై ధర ముద్రణ మాత్రం రూ. 100.15 పై. లేదా 79.45 పై. (బాటా రేటు)అని ఉంటూనే వున్నాయి. మరి వీటిపై చర్యలు ఎందుకు తీసుకోవటంలేదు. ఈ పైసలలో తేడా కేవలం బడా కంపెనీలు ట్యాక్స్ ఎగవేతకే ఉపయోగపడతాయే తప్ప ఏ సామాన్యుని జీవితంకు మిగులు క్రిందకు రాకుండా పోతుంది. ముఖ్యంగా ఈ చిల్లర వ్యత్యాసం గమనించ దగ్గ ప్రవేశం మన డీజిల్/పెట్రోల్ బంకులు. ఇక్కడా సామాన్యుడికి ముందుకు పోతే నుయ్యి వెనకకు పోతే గొయ్యిలాంటి పరిస్థితి. ఎలాగంటే లీటర్ల ప్రకారం పోతే చిల్లర రాదు. డబ్బు ప్రకారం పోతే సరుకు రాదు. మరి ఇంత మాత్రానికి సామాన్యుడికి రూ. 100/- కు పై నోటు అవసరమా? ఎందుకు?

ప్రస్తుతం దొంగతనాలు, మోసం పెరిగిపోతున్న ఈ కాలంలో దొంగ నోట్లపై అనేక సంఘటనలు వింటున్నాం, పత్రికలలో చదువుతున్నాం, దేవుని చిన్న చూపుతో,ప్రభుత్వ గుడ్డి చూపుతో బాధితులం అవుతున్నాం. ఓ వైపు దొంగ నోట్ల తయారీ దారులు, దళారులు, కొందరు బ్యాంకు అధికారులు అందరూ కలిసి సామాన్యుని దోచుకుంటున్నారు. ఇందులో ఏ సామాన్యునికైనా ఒక్క పెద్దనోటు దొంగది తగిలినా న్యాయంకు బదులు, అన్యాయమే ఎదురౌతావుంది. ఎందుకంటే బ్యాంకులో గాని, ఏ.టి.యం యంత్రాలలో గానీ దొంగనోట్లు వస్తే, బ్యాంకులో న్యాయం జరగక పోగా, పోలీసుల చుట్టూ తిరగలేక వ్యధకు గురై చితికి పోతున్నారు. దురదృష్టవశాన మనకు ఎవరి ద్వారానో నోట్ల కట్టలో వచ్చినా, అవగాహనా రాహిత్యం వల్ల బ్యాంకు వెళ్ళితే, దాన్ని చించి వేయడం లేదా మనమే దొంగలమని పోలీసులకు అప్పగించడం జరుగుతావుంది. ఇక్కడ కూడా సామాన్యుడే బలి పశువు.ఒక్క వంద రూపాయలు పోతేనే అర దిన జీవనం కోల్పోయే ఒక సామాన్యుడు రూ. 500/- లేదా రూ. 1000/- ని పొరబాటున ఇలా పోగొట్టుకుంటే ఆ వ్యక్తి, ఆ కుటుంబం ఏమైపోతుంది. ప్రస్తుత మన చట్టాలు, ప్రభుత్వం కూడా సామాన్యుల పై చాలా బాగా పని చేస్తున్నాయి. చాలా అర్థికనేరాలకు సంబందించి వేళ్ళను పెకిలించక భేతాళులుగా మాత్రమే పని చేస్తున్నాయి.

ఇలాంటివే ఇంకా ఎన్నో సందర్బాలు మన నిత్యజీవితంలో చూస్తువుంటాం. ముఖ్యంగా నేటి సమాజంలో ఈ పెద్దనోట్లు మన బావి భారత పౌరులపై ఎంతో ప్రభావం చూపుతూవుంది. భారత దేశ సాంప్రదాయిక పోకడల వైపునుండి చావుపోకడలవైపు ప్రయాణిస్తోందనే భావం కలుగుతా వుంది. చాలా వరకు తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రేమను కేవలం పెద్దనోట్లు ఇవ్వడం

ద్వారానే చూపుతున్నారనే నా భావన. మరి ఆ పిల్లలకు అంత నోటు ఏం చెయ్యాలో తెలిసో తెలియకో అనేక ఖరీదైన వ్యసనాలకు ఖర్చు చేసి తమ భవితను పాడు చేసుకుంటున్నారు. మరి ఇటు భావి భారత బిడ్డలకు గాని, సామాన్యుడికి గాని, మధ్యతరగతికి గాని పనికి రాని ఈ నోట్లు ఎవరికోసం? ఈ పెద్దనోట్లు లేకుండా బ్రతుకు సాగించలేరూ? ఈ పెద్దనోటు ఆలోచన పాపి ఎవడు?

నేటి సమాజం కాగితం రహిత, సాంకేతిక సహితగా సాగుతున్న ఈ యుగంలో ఇంకా ఈ పెద్దనోట్లపై ఆధారపడడం చాలా శోచనీయం. ఇది కంప్యూటర్‌లు,ఏ.టి.యంలు,స్వయిపింగ్ యంత్రాలు వాడుకయుగం. మరి ఈ పెద్దనోట్లు ఎందుకు మన దేశానికి? దీనిపై మన మేధావులు ఎందుకు నోరు మెదపడంలేదు. ఈ పెద్దనోట్ల వల్లనే కదా అనేక స్కాంలు, అనేక దొంగనోట్ల ముఠాలు, (విదేశాలనుండి వచ్చే దొంగ కరెన్సీ. మన దేశంలో రాజకీయనాయికులకు, బడా పేరుమోసిన వ్యాపారులకు, దొంగలకు మినహా ఏ ఒక్కరికి పెద్దనోటుతో పని లేదు. స్కాంలలోని డబ్బును పెద్దనోట్లగా సులువుగా విదేశీ బ్యాంకులకు తరలించటానికి, పెద్దనోటుపై వచ్చే చిల్లర పైసలను బడాబాబులు మిగిలించుకోవటానికి, ఇంకా దొంగనోట్లు అచ్చువేసే వాడికి సులువు. ఒక్క వెయ్యినోటుకొట్టి చెల్లించుకుంటే చాలు వెయ్యి రూపాయలు సొంతం వాడికి. అదే రూ.100/- నోట్లు లేదా చిన్న నోట్లు అయితే వెయ్యికి ఓ పది, ఆపైన అచ్చువెయ్యాలి.అది దొంగనోట్ల వాడికి అచ్చువేయడంలొగాని,చెల్లించుకోవడంలోగాని కొంచెం కష్టం. ( శత్రుదేశాల నుండి అనంతంగా వస్తున్న దోంగ నోట్లు, ఓటుకు నోటు స్కాంని టి.వి.లలో చూసే వుంటారు,మరి ఆ డబ్బు రూ.1000/-నోట్లు కాకుంటే, ). స్కాంలలోని డబ్బు లేదా బాబాల దగ్గర గల డబ్బు తరలించాలంటే చిన్న పాటి ట్రక్కు కావాలి.

ఒక్కసారి ప్రతి ఒక్కరూ ఆలోచించండి. ముఖ్యంగా అదాయపన్ను శాఖ వారు ప్రతి దినం పత్రికలలో, టీ.విలలో ఇన్‌కంట్యాక్స్ చెల్లించండి అనే ప్రకటనల కంటే దీని ద్వారా చాలా మేలు జరుగుతుంది. సామాన్యుడికి పెద్దనోటు అవసరం లేదు. ఇక పెద్దలు తమ వ్యాపార, స్కాం లావాదేవీలన్నీ బ్యాంక్ లద్వారా, ఆన్‌లైన్ పేమెంట్స్ ద్వారా చేసుకోవచ్చు. ఓ వేళ సాంకేతిక లోపం తలెత్తితే చెక్కుల ద్వారా తమ లావాదేవీలు కొనసాగించవచ్చు. నేటి కంప్యూటర్ బ్యాంకింగ్ విధానాలతో అంచెలంచెలుగా భద్రతతో కూడిన లావాదేవీలు కొనసాగించవచ్చు.బ్యాంక్ లావాదేవీలందు మోసాలను అరికట్టేందుకు, 3లేదా అంతకంటే ఎక్కువ భద్రతా హద్దులను కూడా ఏర్పరచుకోవచ్చు మన కంప్యూటర్ల ద్వారా.

తద్వారా పరిమితి దాటిన ప్రతి లావాదేవీని ప్రభుత్వం వారు గుర్తించగలిగితే చాలు. ఇక కంప్యూటర్‌ల ద్వారా అన్‌లైన్ లావాదేవిలు,ఏ.టి.యంలు,స్వయిపింగ్ యంత్రాలుల ద్వారా వ్యక్తిగత లావాదేవీలు కొనసాగించే వీలు వుంది. ఉదాహరణకు ఓ రైతు ఏదైనా వ్యసాయ కొనుగోలు వీటిద్వారా చేయగలిగితే, నగదు చెల్లించిన రుజువుతో పాటు, నకిలీలను కూడా చట్టబద్ధంగా అరికట్టవచ్చు.బ్యాంక్‌ల ద్వారా ఏదైనా తమ ఖాతానందు లావాదేవిలు జరిగిన వెంటనే తమ సెల్‌ఫోన్‌లకు వివరాలు అందుతున్నాయి. ఇలాగే ప్రభుత్వ పథకాలకు నిర్దేశించిన సొమ్ము కూడా ఏవిధమైనటు వంటి ప్రక్కదారి పట్టేందుకు అవకాశం తగ్గుముఖం పడుతుంది. ఇంకా ఎన్నో మీకు ఇలాంటి ఉపకరణాలు, ఉపయోగాలు కనిపిస్తూ వుంటూనే వుంటాయి.

మరి మనకు, మన దేశానికి ఎక్కడ ఈ పెద్దనోట్లు అవసరం? ఇక నైనా నాణ్యాలకు, చిన్న నోట్లకు ప్రాణం పోసి, సామాన్యుడి జీవితాలలో చిన్న మొత్తాల పొదుపును ప్రోత్సహించండి. పైసల దొంగలెక్కలను అరికట్టి వాడుకలోని ఖచ్చితపు ఖజానా రూకల వ్యాపారాన్ని ప్రోత్సహించి, దేశ ఆర్థిక ప్రగతికి నేటినుండైనా పునాది వేయించండి. ప్రస్తుత చలామణిలో వున్న పెద్దనోట్ల పైనేగా మీకు సందేహం? వాటిని వాటి పుట్టింటికి(రిజర్వ్ బ్యాంక్‌కు) పంపి తమ బ్యాంక్ ఖాతాలకు ఆ డబ్బును జమచేయమని చెబితే చాలు. ఇలా చేస్తే మన నోట్లు, దేశ ఆర్థిక స్థితి అన్నీ సురక్షితమేగా. అవినీతి, మోసాలను,లంచాలను అంతం చేయలేక పోయినా,కనీసం చిన్న నోట్లను దాచుకోలేకనైనా విశృంకలతను తగ్గించుకుంటాయి. మరి దీనిపై ఒక్కసారి ఆలోచిద్దామా......

ఇట్లు,

యం.రాజారాం రెడ్డి,

అడ్వకేట్,

3/75,రాయవరం,ఖాదరబాద్(పో),ప్రొద్దుటూరు.516362.